క్లుప్తంగా

వెంటూరులో వైభవంగా లక్ష పత్రి పూజ



వెంటూరు సోమేశ్వరాలయంలో లక్ష పత్రి పూజ చేస్తున్న భక్తులు

రాయవరం: మండలంలోని వెంటూరు గ్రామంలో కొలువైన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష పత్రి పూజ వైభవంగా నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని మద్దిరాల లక్ష్మణ రావు సౌజన్యంతో ఈ పూజ చేశారు. లక్షపత్రి పూజకు ముందుగా మహాన్యాస, నమక, చమకములతో రుద్రాభిషేకం, హోమం, బిల్వార్చన చేశారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. అనంతరం ఘనంగా అన్న సమారాధన జరిగింది. పూజల్లో మాల శివ రాత్రి సభ్యులు దువ్వూరి రామారావు, తటవర్తి రాఘవరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేలటూరులో మాస శివరాత్రి పూజ



నేలటూరులో స్వామి అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరులో 246వ మాస శివరాత్రి పూజను వైభవంగా నిర్వహించారు. స్థానిక బసవేశ్వరస్వామి ఆలయంలో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన నిల్లా ప్రసాద్ కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారంతో అన్నదానం నిర్వహించారు. భక్తులు ఓం నమఃశివాయ నామాన్ని జపించారు. నిర్వాహకులు మాట్లాడుతూ 20 సంవత్సరాల ఆరు నెలలుగా గ్రామంలో మాస శివరాత్రి పూజలు చేస్తున్నామన్నారు.

మరణానంతరం నేత్రదానం



కన్నాబత్తుల ధర్మరాజు(ఫైల్)

రాయవరం: మరణానంతరం ఆయన కన్నులు సజీవంగా ఉండాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. రాయవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ఇంజిమళ్ల సుధాకర్‌బాబు తాతయ్య కన్నాబత్తుల ధర్మరాజు (62) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా ధర్మరాజు దళిత పెద్ద. కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఆయన నేత్రాలను దానం చేశారు. తూర్పుగోదావరి జిల్లా వలంటరీ బ్లడ్ అండ్ ఐ బ్యాంక్ జిల్లా కో–ఆర్డినేటర్ వెలగల ఫణికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ధర్మరాజు నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ధర్మరాజుకు కుమారుడు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. ధర్మరాజు మృతి పట్ల సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్, దళిత పెద్దలు నేతల రాజు, సాదే సత్యనారాయణ, గండి వెంకటరమణ, మిడ్డిపాటి కళాకర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

శాకంబరిగా విజయదుర్గ అమ్మవారు

మండపేట: స్థానిక గాంధీనగర్ రైతు బజార్ సమీప విజయదుర్గ ఆలయంలో కొలువు తీరిన అమ్మవారు శుక్రవారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం కావడంతో ఆలయ నిర్వాహకులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అందంగా అలంకరించారు. ఆలయాన్ని అంతటినీ కూడా అవే కూరగాయలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ ఆలయానికి వెళ్లి శాకంబరి మాతను దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు మధు తెల్లవారుజాము నుంచే విశేష పూజలు నిర్వహించారు. సమీపంలోని 23, 24, 25, 26, 27 వార్డుల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు తలపెట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అన్న ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో జొన్నపల్లి సూర్యారావు, యలమంచిలి శ్రీను, పిల్లా గణపతి, రాజు, శెట్టి రవి, బొత్సా నరసింహమూర్తి, బందారు రాజు తదితరులు పాల్గొన్నారు.

99.08 శాతం మందికి పింఛన్ల పంపిణీ

రాయవరం: మండలంలో ఆగస్టు నెల సామాజిక పింఛన్ల పంపిణీ 99.08 శాతం పూర్తయినట్టు ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలో 10,229 మందికి పింఛన్ల పంపిణీ చేయాల్సి ఉండగా, శుక్రవారం సాయంత్రానికి 10,135 మందికి పంపిణీ పూర్తి చేసినట్లు ఆమె వివరించారు. కేవలం 94 మందికి పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. వివిధ సామాజిక పింఛన్ల రూపేణా రూ.4,20,94,500లకు గాను రూ.4,17,11,000లు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.

పేరుకే ఉచితం .. అంతా అక్రమం..

- స్టాక్ పాయింట్ల నుంచి అక్రమంగా ఇసుక తరలింపు
- నియోజకవర్గ శివారు ప్రాంతానికి రూ.20 వేల ధర
- అధికారులను ఏమాత్రం ఖాతరు చేయని కూటమి నేతలు
- నలిగిపోతున్న సచివాలయ సిబ్బంది



కపిలేశ్వరపురం స్టాక్ పాయింట్‌లోని ఇసుక నిల్వలు



తాతపూడిలో ఇసుకను లోడింగ్ దృశ్యం

కపిలేశ్వరపురం: ఎన్నికల ముందు చెప్పిన మాటలు ఎంతో గొప్పగా కనిపించాయి. ప్రజల ఓట్లతో గద్దెనెక్కాక అవన్నీ నీటి మూటలయ్యాయి. అవినీతి, అక్రమాలకు ఆమడ దూరంలో కూటమి ప్రభుత్వం పని చేస్తుందంటూ టీడీపీ, జనసేన, బీజేపీ అధినేతలు నీతి సూత్రాలు వల్లించారు. తీరా క్షేత్ర స్థాయిలో కూటమి ప్రభుత్వ పాలనాతీరు చూస్తుంటే అందుకు భిన్నంగా ఉందని ప్రజలు విస్తుపోతున్నారు. ఇందుకు ఇసుక తరలింపును ఉదహరిస్తున్నారు. కపిలేశ్వరపురం, తాతపూడి ఇసుక ర్యాంపుల్లో జరుగుతున్న అక్రమాలను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రస్తావిస్తున్నా కనీసం గానైనా అధికారులు పట్టించుకోని పరిస్థితిపై ఈ కథనం...

ఇసుక నిల్వలు అక్రమ తరలింపు ఇలా..

తాతపూడి ఇసుక ర్యాంపులో 25,898 మెట్రిక్ టన్నులు, కపిలేశ్వరపురం ర్యాంపులో 60,188 మెట్రిక్ టన్నుల ఇసుకను వైఎస్ జగన్ ప్రభుత్వం వరదల సమయంలో వినియోగార్థం నిల్వ ఉంచింది. అధికారంలోకి వచ్చి నెల రోజులు గడవక ముందే ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమాలు ఆరంభమయ్యాయి. జూన్ 13 రాత్రి కపిలేశ్వరపురం మండలం తాతపూడి, కపిలేశ్వరపురం గ్రామాల్లోని ఇసుక నిల్వలను తరలింపునకు ప్రయత్నించారు. కపిలేశ్వరపురంలో రాత్రివేళ ఇసుకను భారీ వాహనాల్లో తరలించారు. ప్రజలు అడ్డగించడంతో తరలింపును అధికారులు అడ్డుకట్ట వేశారు. ప్రభుత్వాధినేతలు ఇసుక పాలసీని ప్రకటించి ఇసుక ఉచితమంటూ ప్రచారం చేసుకున్నారు. తీరా కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపుల్లో తరలింపు అందుకు భిన్నంగా నడుస్తోంది. మండపేట నియోజకవర్గంలోని శివారు ప్రాంతమైన వెదురుపాకకు 18 టన్నుల ఇసుకను తరలించేందుకు వినియోగదారుడు రూ. 20 వేలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. టన్ను ధర రూ.245గా తొలుత ప్రకటించిన ప్రభుత్వం తర్వాత రూ.265కు పెంచింది. అలా చూసుకున్నా 18 టన్నుల ధర రూ.4,770 అవుతుంది. స్టాక్ పాయింట్‌లో రూ.11 వేలు వసూలు చేస్తున్నారని సమాచారం. రవాణా చార్జీలు అందుకు అదనం. ఇదే విషయాన్ని ఇటీవల కపిలేశ్వరపురం ఎంపీటీసీ సభ్యురాలు గొల్లపల్లి సోనియా సామాజిక మాధ్యమం ద్వారా ప్రజల దృష్టికి తీసుకొచ్చారు. స్టాక్ పాయింట్ల వద్ద సచివాలయ ఉద్యోగులకు విధులను కేటాయించడంతో వారు తీవ్రంగా నలిగి పోతున్నారు.

తొలి నుంచీ అక్రమాలే..

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడల్లా ఇసుక తరలింపు వివాదాస్పదంగానే ఉంటుంది. 2014–2019 మధ్య టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత ఇసుక పంపిణీ విధానం అమలులో డ్వాక్రా మహిళలను భాగస్వాములను చేసింది. డ్వాక్రా మహిళలను అడ్డంపెట్టుకుని ఇసుక అక్రమాలకు పాల్పడ్డారు. ర్యాంపులు నిర్వహణ బాధ్యత మహిళలకే ఇచ్చామంటూ గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు తర్వాత డ్వాక్రా సంఘాలకు రావాల్సిన పావలా వాటాను ప్రభుత్వం నుంచి పొందేందుకు మహిళలు పెద్ద ఉద్యమం చేయాల్సి వచ్చింది. పావలా వాటాను అడిగినందుకు 2015 జూలై 4న కోరుమిల్లి ఇసుక ర్యాంపులో మహిళలపై లాఠీచార్జీ చేయించింది ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం. సుమారు వంద మంది పోలీసులు మహిళలపై విరుచుకు పడడం రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. పది మంది మహిళలకి గాయాలవ్వగా సుమారు 25 మందిని అరెస్టు చేసి ఆలమూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. చంద్రబాబు ఉచిత ఇసుక విధానం వెనుక మహిళలను కోర్టులు చుట్టూ తిప్పిన చరిత్ర దాగి ఉంది.

వరద తగ్గింది.. బురద మిగిలింది..

తగ్గిన గోదావరి ఉధృతి



పుష్కర ఘాట్ వద్ద వరద తగ్గడంతో బురదమయంగా మారిన దృశ్యం

కె.గంగవరం: ఉగ్రరూపం దాల్చిన గోదావరి శుక్రవారం ఉదయం నుంచి పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టింది. వరద ఉధృతి తగ్గుతుండడంతో గోదావరి పరివాహక ప్రజలు, ముంపు గ్రామ ప్రజలు కొంత వరకు ఉపశమనం పొందారు. కోటిపల్లిరేవులోని ఫెర్రీ వద్ద పుష్కర ఘాట్‌ల మధ్య వరకు ప్రస్తుతం వరద ప్రవహిస్తుంది. దీంతో పైనున్న పుష్కరఘాట్‌ల మెట్లు అడుగమేర బురదగా మారాయి. మత్స్యకార కాలనీలోని మూడు పేటల్లో వరదనీరు తగ్గడంతో ఇళ్లను ప్రజలు శుభ్రం చేసుకుంటున్నారు. గోదావరి ఉధృతి తగ్గినా అటుపై గల రహదారి కొట్టుకుపోవడం వల్ల పంటు ప్రయాణాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు నిలిపి వేశారు. పూర్తి స్థాయిలో వరదనీరు తగ్గిన తరువాతే పంటు ప్రయాణానికి అనుమతిస్తామని వారు తెలిపారు. నిన్నటి వరకు ఉగ్రరూపం దాల్చిన గోదావరి ప్రస్తుతం ప్రశాంతంగా ప్రవహిస్తోంది. మత్స్యకార కాలనీలో వరద ముప్పు వీడడంతో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నారు. నీరు నిల్వ ఉండకుండా చూడడంతో పాటు బ్లీచింగ్ చల్లడం, దోమల మందు స్ప్రే చేయడం వంటి పనులు చేశారు. కాలనీల వద్ద ఇంకా వైద్య శిబిరం కొనసాగుతుంది. పరిధి దాటి పయనించిన గోదావరి నిర్దేశించిన పరిధిలో పారుతూ, తాడిచెట్ల మొదళ్లను తాకుతూ ప్రస్తుతం ప్రజలకు కనువిందు చేస్తుంది.

మూడు దశాబ్దాల కల నెరవేరింది

ఎస్సీ వర్గీకరణపై రవి కుమార్ హర్షం



మండపేట: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పు మాదిగలు, మాదిగ ఉపకులాల పోరాటాల ఫలితమని భావిస్తున్నామని వైఎస్సార్ సీపీ 7వ వార్డు కౌన్సిలర్, దళిత నాయకుడు మందపల్లి రవికుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పుపై మాదిగలు, మాదిగ ఉపకులాల వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ జనాభా లెక్కల ప్రకారం 80 శాతం మాల మాదిగలు ఉండగా, మిగిలిన 20 శాతం ఎస్సీల్లోని ఉపకులాల వారున్నారన్నారు. ఇప్పటి వరకూ ఎక్కువ జనాభా ఉన్న తమకు తక్కువ శాతం రిజర్వేషన్లు దక్కగా, తక్కువ జనాభా ఉన్న మాలలు ఎక్కువ రిజర్వేషన్లు అనుభవిస్తూ వచ్చారన్నారు. ఈ విధంగా వెనుకబాటుతనానికి గురవుతున్న మాదిగ, మాదిగ ఉప కులాల భవిష్యత్తు కోసం మంద కృష్ణ మాదిగ 30 ఏళ్లుగా పోరాటం సాగించారన్నారు. ఆయన కృషి ఫలితంగా ఇప్పుడు సుప్రీం కోర్టు వర్గీకరణ అమలు చేయాలని తీర్పు ఇవ్వడం హర్షణీయమని రవికుమార్ పేర్కొన్నారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరతగతిన అమల్లోకి తీసుకు రావాలని ఆయన కోరారు.

సర్వీసులు క్రమబద్ధం చేయాలని టీచర్ల వినతి



మండపేటలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

మండపేట: తమ సర్వీసులను క్రమబద్ధం చేయాలని 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరారు. డీఎస్సీ– 1998 టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తమ పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, ఒక రోజు గ్యాప్‌తో 12 నెలల జీతాలు చెల్లించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌ప్రసాద్‌కు వారు అందజేసిన వినతి పత్రంలో ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. రెగ్యులర్ టీచర్లతో పాటు ఒకటో తేదీన జీతాలు వేస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కంతంశెట్టి గౌరి, 1998–అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కోటిపల్లి రాంబాబు, ఉపాధ్యాయులు నేరెళ్ల సత్యనారాయణ, డి.సత్యనారాయణ, టీవీవీ సత్యనారాయణ, ఆర్‌వీఎస్ మూర్తి, టి. శాంతా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి



మంత్రి సుభాష్‌కు వినతిపత్రం ఇచ్చి సమస్యలు వివరిస్తున్న రైతు సంఘాల నాయకులు

కాజులూరు: భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. శుక్రవారం కాజులూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను రాజబాబు తదితర నాయకులు కలసి వినతిపత్రం సమర్పించి రైతుల సమస్యలను వివరించారు. జిల్లాలో రైతులు తొలకరి సాగు పనులు నిర్వహిస్తున్నారని పెట్టుబడులకు సొమ్ములు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఇస్తామన్నా రూ.20 వేలు వెంటనే వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమచేయాలని, 2019 చట్టాన్ని రద్దు చేసి 2011 చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పెనుమళ్ళ మాజీ సర్పంచ్ వనుం వీరబ్రహ్మం, కౌలు రైతుసంఘం మండల శాఖ అధ్యక్షుడు అల్లాడి నరసింహమూర్తి, రైతు సంఘాల నాయకులు నామా చంద్రరావు, పిల్లి ఏడుకొండలు, వాసంశెట్టి సూర్యనారాయణ, కురుపూడి భూచక్రం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే కాలుష్య నివారణ సాధ్యం

పర్యావరణ పరిరక్షణతోనే కాలుష్య నివారణ సాధ్యమవుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కాజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం మంత్రి సుభాష్ సందర్శించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలలో 96 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడమే కాకుండా 35 మందికి పైగా 500 మార్కులు సాధించటంపై ప్రశంసలు వ్యక్తం చేశారు. పాఠశాల నుంచి ఈ ఏడాది నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ సాధించిన నలుగురు విద్యార్థులను అభినందించారు. అనంతరం స్థానిక నాయకులతో కలసి ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మాకే నామ్ పర్ ఏక్ పేడ్ (అమ్మ పేరుతో ఒక చెట్టు) కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటడం ద్వారా గాలిలో కార్బండైఆక్సైడ్ శాతం తగ్గి కాలుష్య నివారణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, అన్యం శ్రీరామా చంద్రమూర్తి, యాళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వట్టి బూటకం

- నేటి రాజమహేంద్రవరంలో హర్షకుమార్ సభకు తరలి రావాలి
- దళిత నాయకుడు యడ్ల రవి



సమావేశంలో మాట్లాడుతున్న దళిత నేత యడ్ల రవి

మండపేట: ఎస్సీ వర్గీకరణ అనేది ఒట్టి బూటకమని రాష్ట్ర దళిత నాయకుడు యడ్ల రవి అన్నారు. మండలంలోని కేశవరం గ్రామంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం మాల మహానాడు నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రవి మాట్లాడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టేందుకే వర్గీకరణ అంశాన్ని తీసుకొచ్చారన్నారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెలివిగా రాష్ట్రాల మీద పెట్టిందే తప్ప పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందమని చెప్పలేదన్నారు. ఇష్టం ఉన్న రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తాయని, ఇష్టం లేని రాష్ట్రాలు చేయవని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని లోగడ సుప్రీంకోర్టు కొట్టి వేసిందన్నారు. తాజాగా సుప్రీంకోర్టులో ప్రధాని మోదీ, చంద్రబాబు ఆడిన నాటకాలని రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణ చేయాలనుకుంటే పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించి వర్గీకరణ చేయాలన్నారు. మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ నాయకత్వంలో తాము దీనిపై ఎంతటి పోరాటానికైనా సిద్ధపడతామన్నారు. శనివారం రాజమహేంద్రవరంలో మాజీ ఎంపీ హర్ష కుమార్ తలపెట్టిన సభకు మాలలు అంతా తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాల మహానాడు నాయకులు తలారి నాని, కొక్కిరి కామేశ్వరరావు, పల్లి ఏసు, కంకట్ల బాలు, యడ్ల పట్టాభి, నేతల సుధీర్, పినిపే అజయ్, కొక్కిరి శేఖర్ పాల్గొన్నారు.

రేపు రాయవరంలో ఉచిత ధ్యాన శిబిరం

రాయవరం: ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాయవరంలో ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు ప్రముఖ యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి తెలిపారు.

సచివాలయాల్లో ఆధార్ నవీకరణ



కపిలేశ్వరపురంలో ఆధార్ వివరాలను నమోదు చేస్తున్న మల్లేశ్వరరావు

కపిలేశ్వరపురం: మండలంలోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ వివరాలను నవీకరించే సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కొండలరావు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఆధార్ శిబిరాల్లో కొత్త ఆధార్ కార్డుల మంజూరుకు వివరాలు నమోదు చేశామన్నారు. కపిలేశ్వరపురం కేంద్రంగా అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో డిజిటల్ అసిస్టెంట్ ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, టేకి కేంద్రంగా వాకతిప్ప, మాచర, కోరుమిల్లి–2 సచివాలయాల్లో ఫణీంద్ర, వల్లూరు కేంద్రంగా నల్లూరు, అంగర –2, వెదురుమూడి సచివాలయాల్లో కె.దొరబాబు నవీకరణ చేశారన్నారు. మండలంలోని ఎనిమిది గ్రామాల్లో 99 మందికి నూతన ఆధార్ కార్డులను నమోదు చేయగా 87 మందికి బయోమెట్రిక్ వివరాలు నమోదు చేశారన్నారు. 165 మందికి పేర్లు, అడ్రస్, ఫోన్ నంబర్లు తదితర వివరాలను అప్‌డేట్ చేశారన్నారు. ఇక నుంచి వల్లూరు, కపిలేశ్వరపురం, టేకి సచివాలయాల్లో ఆధార్ నవీకరణ ప్రక్రియ కొనసాగుతుందని ఎంపీడీఓ తెలిపారు.

ఈ–క్రాప్ తప్పనిసరిగా చేయించాలి

కాజులూరు: గ్రామాల్లో తొలకరి పంట సాగు చేస్తున్న రైతులందరితో తప్పనిసరిగా ఈ–క్రాప్ (పంటల నమోదు) చేయించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మండలంలోని కాజులూరులో శుక్రవారం వీఏఏలతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి పంటల నమోదు కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో సుమారు 19,050 ఎకరాల సాగు భూమికి గానూ 17 వేల మంది రైతు ఖాతాలు ఉన్నాయన్నారు. వీరందరినీ చైతన్యపరచి తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకునేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ–కేవైసీ లేని పక్షంలో ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల్లో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో పలువురు వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

తల్లి పాల ప్రాధాన్యతను గుర్తించాలి



పసలపూడిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవం

కపిలేశ్వరపురం: బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించాలంటూ గర్భిణులు, బాలింతలకు వైద్య ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీలు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి, అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.రత్నకుమారి, పి.చంద్రమౌళి, కరుణేంద్ర కుమారి పర్యవేక్షణలో గ్రామాల వీధుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వడ్లమూరు, నిడసనమెట్ట, అంగర, పడమరఖండ్రిక తదితర గ్రామాల్లో అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ఈనెల 8 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

పసలపూడిలో..

రాయవరం: పసలపూడిలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని హెల్త్ సెంటర్ వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడలి పద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షురాలు డి.ఆదిలక్ష్మి, వైద్య ఆరోగ్య శాఖ ఎంఎల్‌హెచ్‌పీ క్రాంతి, రేచర్ల మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి లభిస్తుందన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమన్నారు. తల్లిపాలు వలన బిడ్డకు, తల్లికి కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు ఎస్వీ కృష్ణారెడ్డి, కొవ్వూరి వెంకటేశ్వరరావు, జీఎంఎస్‌కేలు పి.సౌజన్య, ఎస్.సౌజన్య ప్రియాంక, ఏఎన్‌ఎంలు జి.ఇంద్రజ, ఐ.సుధ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తొలకరిలో జోరుగా వెదచల్లికలు

- కలుపు ఉధృతిపై రైతుల ఆందోళన
- నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు



కాజులూరులో వెదచల్లిన వరి పొలంలో కలుపు నివారణకు రసాయన మందు పిచికారీ చేస్తున్న రైతులు

కాజులూరు: రామచంద్రాపురం నియోజకవర్గ గ్రామాల్లోని ఈ ఏడాది తొలకరిలో అధిక శాతం రైతులు వెదచల్లిక విధానాన్ని చేపట్టారు. నియోజకవర్గంలో 56 వేల ఎకరాల సాగుభూమి ఉండగా ప్రస్తుత ఖరీఫ్‌లో తొలిదశ అయిన నాట్లు, వెదచల్లిక ప్రక్రియ ముమ్మరంగా జరిగింది. కాజులూరు మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 19,500 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టగా ఇందులో సుమారు 85 శాతం పొలాల్లో రైతులు వెదచల్లిక విధానాన్నే అవలంభిస్తున్నారు. కె.గంగవరం మండల గ్రామాల్లో 50 శాతం, రామచంద్రపురం మండల గ్రామాల్లో 60 శాతం మంది రైతులు వెదచల్లిక విధానాన్ని అవలంభించారు. సాధారణ పద్ధతిలో రైతులు దుక్కుదున్ని పొలాన్ని చదును చేసి నాట్లు వేస్తారు. ఈ విధానంలో కలుపు తీవ్రత తక్కువగా ఉంటుంది. అయితే వెదచల్లిన పొలాల్లో వరి మొక్కతో పాటు కలుపు సమాంతరంగా పెరుగుతుంది. ఈ కలుపు మొక్కలను సకాలంలో నివారించకుంటే అవి ఎరువులను, భూమిలోని పోషకాలను ఉపయోగించుకుని క్రమేపీ వరి మొక్కలను అధిగమించి పెరుగుతాయి. నియోజకవర్గ గ్రామాల్లో వెదచల్లిన పొలాల్లో కలుపు తీవ్రత ఊహించిన దాని కంటే ఎక్కువగానే ఉందని రైతులు చెబుతున్నారు. కొన్ని రకాల కలుపు మొక్కలను నివారించడం కష్టతరంగా ఉందంటున్నారు. తెలిసి, తెలియని రసాయన మందులు వాడితే కలుపు మొక్కతో పాటు వరిమొక్క చనిపోతుందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వెదచల్లిన పొలాల్లో రైతులు కలుపు నివారణకు రసాయన మందులను నిర్ణయించిన మోతాదులో సకాలంలో వాడాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచిస్తున్నారు.



వి.అశోక్, మండల వ్యవసాయాధికారి

పొలాల్లో కలుపు నివారణకు సూచనలు

వెదచల్లిన పొలాల్లో వరి మొక్క బొడ్డు మొలవక ముందే కలుపు నివారించుకోవడం సులభతరమని ఏఓ అశోక్ చెబుతున్నారు. విత్తనాలు చల్లిన మూడు రోజుల్లోపు పొలంలో నీరు తీసేసి సాతి 120 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా దుంపజాతి కలుపు నివారణకు లోంబాక్స్ పవర్ మందును ఎకరానికి నాలుగు కేజీల చొప్పున విత్తనాలు చల్లిన మూడు రోజుల లోపు చల్లితే దుంపతో సహా నిర్మూలించబడుతుందన్నారు. మూడు నుంచి ఐదు రోజుల మధ్యలో స్టాప్‌స్టార్ 35 గ్రాముల మందును అరలీటరు నీటిలో కలిపి ఆ మందు ద్రావణాన్ని 20 కేజీల గోదావరి ఇసుకతో కలిపి ఎకరం పంటపై బురద పదును పై చల్లుకోవాలన్నారు. 15 నుంచి 20 రోజులకు కలుపు ఇంకా ఉన్నట్టయితే నామినీ గోల్డ్ మందును 100 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. 15 రోజులు తర్వాత పొలంలో వుడా, జోడల గడ్డి వంటి వెడల్పాటి ఆకులు కలిగిన కలుపు మొక్కలు కనిపిస్తే 2,4–డి సోడియం సాల్ట్ 500 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి పొలంలో పిచికారీ చేయాలన్నారు. కలుపు మందులు పిచికారీ చేసేటప్పుడు పొలంలో పలుచటి నీటిపొర మాత్రమే ఉండాలన్నారు. నీరు నిలబడితే మొక్కలు చనిపోతాయన్నారు. వెదచల్లిన పొలాల్లో కలుపును సమర్థవంతంగా నివారించి తెగుళ్లను అధిగమించగలిగితే నాట్లు వేసిన పొలం కంటే ఎకరాకు ఐదు నుంచి పది బస్తాల ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు.